


జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం

గురువారం | 28 | మే | 2026 ◆ పేజీలు : 5


# తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**కొత్తగూడెం కలెక్టరేట్, మే 27,(ప్రజాజ్యోతి)** తడిసిన ధాన్యాన్ని కూడా తప్పకుండా కొనుగోలు చేస్తామని, రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన తడిసిన ధాన్యాన్ని సత్వరమే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు. అకాల వర్షాలకు తడిసిన 9,214 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించినట్లు వెల్లడించారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఏర్పడిన పరిస్థితులపై సమీక్షించేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రివర్గ సహచరులు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్లు, పోలీసు అధికారులు, రవాణా శాఖ అధికారులు, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగానికి నష్టం కలిగించే ఎటువంటి చర్యలను ప్రభుత్వం ఉపేక్షించబోదన్నారు. ఇది రైతు పక్షపాత ప్రభుత్వం అని, చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. రబీ సీజన్‌లో రికార్డు స్థాయిలో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టిందన్నారు. ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు 66.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం చేరగా

మిగతా 2 లో...



- అసలు వ్యాపారమే చేయని వారికి షాపులా!
- ఏళ్ల తరబడి షాపులు నడుపుకునే వారికి మొండి చేయి!
- ఇదెక్కడి తీరంటూ ప్రశ్నలు
- 51వ నెంబర్ షాపు కేటాయింపుపై పలు అనుమానాలు!
- అధికారులకు తెలిసి జరిగిందా.. తెలియదా
- మరోమారు పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలంటున్న అర్హులు
- పాత మార్కెట్ లో వ్యాపారాలు చేసే వారికి న్యాయం చేయరూ
- అధికారులు జర దృష్టి సారించరూ!

5 లో..

# ఇష్టానుసారంగా... షాపులను కేటాయించారా?

ఇల్లందు మున్సిపల్ పరిధిలో కొన్ని ఏళ్ల నుంచి పాత కూరగాయల మార్కెట్ లో వ్యాపారం చేసుకుంటున్న వారికి అన్యాయం జరిగిందని పలువురు పేర్కొంటున్నారు. పాత మార్కెట్ లో వ్యాపారం చేసే వారికే మొదటి ప్రాధాన్యత ఇస్తామని అధికారులు చెప్పిన కానీ అది పూర్తి స్థాయిలో ఆచరణకు సాధ్యమవ్వలేదనే ఆరోపణలు లేకపోలేదు. రూ. కోట్లతో నూతనంగా మోడల్ మార్కెట్ ను నిర్మించి ఏళ్ల గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క షాపు కేటాయించలేదు. పలు దఫాలుగా వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసిన కానీ షాపుల కేటాయింపు ఓ కొలిక్కి రాలేదు.

● ఇల్లందు, ప్రజాజ్యోతి

# జన్మనిచ్చిన తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలి

- పదో తరగతి విద్యార్థుల సన్మాన సభలో భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్



**భద్రాచలం టౌన్, మే 27 ప్రజాజ్యోతి** మనం విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నతస్థానంకు ఎదిగి మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. బుధవారం ఐటీడీఏ సమావేశం మందిరంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులం కళాశాలలో పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ వరకు చదివి పరీక్షలలో అత్యుత్తమ మార్కులు సాధించిన గిరిజన విద్యార్థిని విద్యార్థులకు సన్మానంతో పాటు ప్రశంసా పత్రాలు పిల్లల తల్లిదండ్రుల సమక్షంలో అందించారు. అనంతరం పీవో రాల్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో చదివిన విద్యార్థినీ విద్యార్థులు సాధించిన మార్కులు సాధించి రాష్ట్రంలోనే మన జిల్లాకు

మిగతా 2 లో...

# ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీ అమలు
- మహిళలకు చీరల పంపిణి చేసిన ఎమ్మెల్యే



**ఇల్లందు, మే 27, ప్రజాజ్యోతి:** రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రాష్ట్రంలోని మహిళలకు ప్రజా ప్రభుత్వం ఇందిరా మహిళ శక్తి పథకం ద్వారా ఉచితంగా చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి ఒక్క హామీని రాష్ట్ర ఏర్పడిన తరువాత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఒక్కొక్కటిగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ

మిగతా 2 లో...

## తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం

(మొదటి పేజీ తరువాయి...)




అందులో 57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు ఇప్పటివరకు రూ.10,097 కోట్లు చెల్లించామని, దీని ద్వారా 8.15 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. కొనుగోళ్లలో తెలంగాణ రాష్ట్రం సరికొత్త రికార్డు సృష్టించిందని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన 57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో 44.67 లక్షల మెట్రిక్ టన్నులు సాధారణ రకాల ధాన్యం కాగా, 12.33 లక్షల మెట్రిక్ టన్నులు సన్న రకాల ధాన్యమని వివరించారు. ఇసుక సరఫరాకు వినియోగించే లారీలను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు మళ్లించి, సత్వరమే ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేసేందుకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రికార్డు స్థాయిలో కొనుగోళ్లు నిర్వహిస్తుంటే, ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధి కోసం కొనుగోళ్ల ప్రక్రియపై అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని మంత్రి మండిపడ్డారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రైతాంగానికి ఎక్కడా ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సుకు ఐ డి ఓ సి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అంకిత్ అదనప కలెక్టర్ వేణుగోపాల్, సంబంధిత శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు.

## జన్మనిచ్చిన తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలి

(మొదటి పేజీ తరువాయి...)

మంచి పేరు వచ్చిందని, పదవ తరగతిలో మంచి మార్కులు సాధించినంత మాత్రాన ఇంతటితో మీ జైత్రయాత్ర ఆపకూడదని, రెండు సంవత్సరాల ఇంటర్మీడియట్ లో వచ్చిన మార్కులతో ఎంసెట్, నీట్, జేఈఈ , ఇతర గ్రూప్స్ రాయడానికి ఎంతో ఉపకరిస్తాయని పేర్కొన్నారు. ఎంపీసీ, బైపిసి చదివిన పిల్లలు బీటెక్, ఎంబీబీఎస్ కోర్సులు చేయడానికి ఉపకరిస్తాయని, సిఇసి, హెచ్ఈసి చదివిన పిల్లలు గ్రూప్స్ కాంపిటేటివ్ సిద్ధమయ్యే వారికి, సివిల్స్ ఎంట్రెన్స్ రాసే వారికి దాదాపు 50 శాతం ప్రశ్నలు ఈ కోర్సులు చదివిన వారికి తప్పకుండా వస్తాయని తెలిపారు. 550 మార్కులకు పైగా సాధించిన వారితో పాటు జేఈఈ మెయిన్స్‌లో విజయం సాదించిన ఐదుగురు, ఎఫ్‌సెట్‌లో ఇంజనీరింగు సీట్లు సాధించిన నలుగురిని ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేవారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ , ఆర్సీవో గురుకులం అరుణకుమారి, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు అ శోక్, విజయలక్ష్మి, ఏసిఎంఓలు రమేష్, రాములు, ఏ టి డి ఓ చంద్రమోహన్, భారతీదేవి, క్రీడల అధికారి గోపాలరావు, ప్రిన్సిపాల్స్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

## వడదెబ్బతో వృద్ధుడు మృతి

- **అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన**



**చర్ల, మే 27: (ప్రజా జ్యోతి):** చర్ల మండలం మొగళ్లపల్లి గ్రామానికి చెందిన కొమ్మినేని శ్రీనివాసరావు (65) బుధవారం వడదెబ్బకు గురై మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. మండుతున్న ఎండలు, అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో ఆయన అస్వస్థతకు గురి అవ్వటంతో హుటాహుటిన చర్ల సి హెచ్ సి కి కుటుంబ సభ్యులు తరలించగా డాక్టర్ సాయి వర్ధన్ వైద్య పరీక్షలు నిర్వహిస్తుండగా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు.శ్రీనివాసరావు మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ప్రస్తుతం మండలంలో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.ఈ సందర్భంగా చర్ల సీహెచ్‌సీ వైద్యుడు సాయి వర్ధన్ మాట్లాడుతూ, ఎండల సమయంలో వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మధ్యాహ్న సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, తగినంత నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటి ద్రవపదార్థాలు తీసుకోవాలని సూచించారు. తలనొప్పి, వాంతులు, అధిక చెమటలు, శరీర ఉష్ణోగ్రత పెరగడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప వైద్యశాలను సంప్రదించాలని ఆయన సూచించారు.

# ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



(మొదటి పేజీ తరువాయి...)

ఆశీర్వాదాలతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన మూడు రోజులకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులను సర్దుబాటు చేసుకుంటూ పథకాలను అమలు చేసుకుంటూ ముందుకు సాగుతుందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సుతోపాటు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పేదలందరికీ సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, మహిళ స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలతో పాటు మరెన్నో పథకాలను నిర్విరామంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. గత ప్రభుత్వానికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి తేడా ప్రజలకు తెలుసునని, ప్రజలు అన్ని గమనిస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని పథకాలు అమలు చేసిన హంగు, ఆర్భాటం, పబ్లిసిటీ లేకుండా పేదల కోసమే పని చేస్తుందన్నారు. అదేవిధంగా వచ్చే నెలలో అర్హులైన పేదలందరికీ పెన్షన్లతో పాటు రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కోట్లు మంది మహిళా సోదరీమణులను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళలకు చీరలను పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై చేసే ఆరోపణలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండేల రాజు, మున్సిపల్ కమిషనర్ చింత శ్రీకాంత్, మున్సిపల్ కౌన్సిలర్లు సైదు మియా, ఆజ్మీరా వంశీ, యండి కుష్బూ, చిల్లా విజయభారతి, రాధ కమల్ కోరి, గోపగాని రాజు గౌడ్, రేఖ స్వరూప, గందె పద్మ, మెరుగు కార్తీక్, మొగిలి లక్ష్మి, రంప రమ్య, దండు సారయ్య, నీరుడు ఉపేంద్ర, సోనీ బాయి కోరి, ఉల్లింగ విజయలక్ష్మి, యండి జాఫర్, నీలాపు రమేష్, కొర్లపాటి శివ కిరణ్, కో ఆప్షన్ సభ్యులు మడుగు సాంబమూర్తి, పరె స్వర్ణలత, హసీనా, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# గోరక్షణ చట్టాలు కఠినంగా అమలు చేయాలి

- **గోసంరక్షణపై అధికారులకు వినతిపత్రం అందజేత**

**చర్ల, మే 27: (ప్రజా జ్యోతి ):** గోరక్షణ చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని కోరుతూ చర్ల మండల విశ్వహిందూ పరిషత్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం చర్ల తహసీల్దార్, సీఐ, గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవు భారతీయ సంస్కృతిలో పవిత్ర స్థానాన్ని కలిగి ఉందని, వేద కాలం నుంచే గోవును ఆరాధిస్తున్నామని తెలిపారు. గోపాలను, గోసంరక్షణను ప్రతి భారతీయుడు తన బాధ్యతగా భావించాలని ప్రస్తుతం రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో గోవుల అక్రమ రవాణా, వధ జరుగుతుండటం ఆందోళన కలిగించే విషయమన్నారు.తెలంగాణలో అమల్లో ఉన్న "ది తెలంగాణ ప్రొహిబిషన్ ఆఫ్ కౌ స్లాటర్ అండ్ యానిమల్ ప్రిజర్వేషన్ యాక్ట్ – 1977"ను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.


దేశీ గోవంశ రక్షణ సంవర్ధన సమితి - తెలంగాణ
DESI GOVAMSHA RAKSHANA SAMVARDHANA SAMITHI - TELANGANA

రాజ్యాంగంలోని ఆర్టికల్ 48 ప్రకారం గోసంరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. అక్రమ గోవధశాలలను వెంటనే మూసివేసి, గోవుల అక్రమ రవాణాను అరికట్టాలని కోరారు.అలాగే ప్రతి జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో గోశాలలను ఏర్పాటు చేసి, అనాథగా తిరుగుతున్న గోవులకు ఆశ్రయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు గో ఆధారిత వ్యవసాయంపై అవగాహన కల్పించి, గోవుల సంరక్షణకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. గ్రామాల్లో గోవులకు అవసరమైన మేత భూములను కేటాయించాలని, పచ్చిక బయళ్లను రక్షించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా నడుస్తున్న బీఫ్ షాపులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని, గో సంరక్షణ కోసం ప్రత్యేక పోలీస్ చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గోవుల రవాణాలో నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ హైకోర్టు గో సంరక్షణపై ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో చర్ల విశ్వహిందూ అధ్యక్షులు మామిడి శ్యామ్ ప్రసాద్, ఉపాధ్యక్షులు ఇరస వడ్ల రాము, మీసాల శ్రీను, కార్యదర్శి శివరాజు కృష్ణ కిషోర్ కుమార్, సహ కార్యదర్శి అలవాల మురళి, సహసం యోజక్ గాధంశెట్టి ప్రదీప్, గోలికర్ ప్రేమ్ కుమార్, వేములపల్లి ప్రవీణ్, బందా మధు, చింతూరి వినోద్ పాల్గొన్నారు. విశ్వహిందూ పరిషత్ ప్రఖండ సభ్యులు హాజరయ్యారు.

# ఎమ్మెల్యే పై ఆరోపణలు చేస్తే సహించేది లేదు

- పూసపల్లి ఓసి ఆలస్యానికి హరిప్రియ నే కారణం
- సెప్టెంబర్ లో పూసపల్లి ఓసి ప్రారంభం




**ఇల్లందు, మే 27, ప్రజాజ్యోతి:** పూసపల్లి ఓసి విషయంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్యే తమ్ముడు ప్రమేయం ఉందని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఐఎన్టియుసి ఇల్లందు ఉపాధ్యక్షుడు జె వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుధవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పూసపల్లి ఓసి ఆలస్యానికి హరిప్రియనే కారణమన్నారు. సెప్టెంబర్ నెలలో పూసపల్లి ఓసి ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో హరిప్రియ ఏమి చేసిందో అందరికీ తెలుసునని విమర్శించారు. హరిప్రియ హయాములో పూసపల్లి ఓసిని సి-5, కోయగూడెం పిట్ 3 ఓసిని అరవిందో కంపెనీకి కేవలం కమిషన్ల కోసమే అప్పగించారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవ తీసుకొని ఓసి లేకపోతే ఇల్లందు మనుగడ కష్టమవుతుందనే ఆలోచనతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో యాజమాన్యంతో చర్చించి ఓసీని కాలయాపన చేయకుండా ప్రారంభించేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. పూసపల్లి ఓసి కి ఉన్న సమస్యలను ఎమ్మెల్యే సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం, ఐఎన్టియుసి చొరవతో పరిష్కరించడం జరిగిందని పేర్కొన్నారు. దాదాపుగా 90 శాతం అనుమతులను ఓసీ కోసం తీసుకురావడం జరిగిందని స్పష్టం చేశారు. అటవీ శాఖ అనుమతులు బిఆర్ఎస్ ప్రభుత్వం హయం లోనే ఆలస్యం అయ్యాయని విమర్శించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో మే 29న పూసపల్లి ప్రాంతంలో గ్రామ సభ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. డీజీఎంఎస్ సేఫ్టీ విభాగం వారు 50 మీటర్ల స్థలం వదిలి పనులు ప్రారంభించాలని సూచన చేసినప్పటికీ, ఎవరికి అన్యాయం జరగవద్దని ఆలోచనతో ఎమ్మెల్యే నిరంతరం కృషి చేయడం జరుగుతుందన్నారు. 129 ఇండ్లు ఉన్న వారికి భూమి ఇచ్చేందుకు ఎమ్మెల్యే చొరవ చూపుతున్నాడని తెలిపారు. సింగరేణి సంస్థకు 130 ఏళ్ల చరిత్ర ఉందని, సింగరేణి నష్టాల్లో ఉన్న సమయంలో అప్పటి కేంద్ర కార్మిక శాఖ మంత్రి వెంకటస్వామి చొరవతో రూ. 600 కోట్ల మానిటోరియం ఇప్పించడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం సింగరేణి సంస్థ లాభాల బాటలో నడుస్తుందని, కార్మికుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ఐఎన్టియుసి, ఎమ్మెల్యే ముందుంటారని స్పష్టం చేశారు. సింగరేణి వ్యాప్తంగా ఐదు నూతన ఓసీలకు అనుమతులు వచ్చాయని కొత్తగూడెం, సత్తుపల్లి, గోదావరిఖని, కైరిగూడ ఓసీలు ప్రారంభమయ్యాయని, పూసపల్లి ఓసి ఆలస్యం కాకుండా సెప్టెంబర్ లోనా ప్రారంభమవుతుందని తెలిపారు. అదేవిధంగా కోయగూడెం పిట్ 3 సైతం జాప్యం జరగకుండా అతి త్వరలోనే ప్రారంభించేందుకు యాజమాన్యం సిద్ధంగా ఉందని, సింగరేణి సంస్థ ద్వారానే బొగ్గు వెలికితీసేందుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారని తెలిపారు. బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్కా సుమన్ సింగరేణి భవనాలు కూల్చాలని, బొగ్గు రవాణా జరిగే పట్టాలను దంచాలనే మాట్లాడడం సరికాదన్నారు. 1200 మంది ఆత్మ బలిదానాలకు చెల్లించి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందని, ఏదో తాము చేయబట్టే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని గొప్పలు చెప్పుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఉద్రేకపు మాటలు మాట్లాడవద్దని బాల్క సుమన్ కు సూచించారు. అనంతరం ఐఎన్టియుసి జనరల్ సెక్రటరీ గోచికొండ సత్యనారాయణ మాట్లాడుతూ ఇల్లందు భవిష్యత్తు కోసం ఎమ్మెల్యే కోరం కనకయ్య ఎంతో కృషి చేస్తున్నారని స్పష్టం చేశారు. 2017లో స్ట్రట్ ఫిట్ మైన్ మూతపడే పరిస్థితిలో ఉన్న తరుణంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య అఖిలపక్షం వారిని కలుపుకొని అప్పటి, ప్రస్తుతం మంత్రి తుమ్మల సహకారంతో ఒక సంవత్సరం పొడిగించడం జరిగిందని గుర్తు చేశారు. అదేవిధంగా జెకె ఓసి ని మూసి వేయకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి భవిష్యత్తును పెంచారని గుర్తు చేశారు. 2024లో జెకె 5 ఓసిలోకి వెళ్లి అక్కడి పరిస్థితులను తెలుసుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. అదేవిధంగా జెకె 5 ఓసిలో పనిచేసే కార్మికులను ఇతర ఏరియాలకు డిప్యూటేషన్ పై బదిలీ చేసి పూసపల్లి ఓసి ప్రారంభం కాగానే మరల వారిని ఇల్లందుకే రప్పించడం జరుగుతుందని తెలిపారు. సింగరేణి సంస్థ ప్రైవేటుపరం కాదని, మాజీ ఎమ్మెల్యే కు సింగరేణి సంస్థ విషయంలో ఎలాంటి అపోహాలు ఉండవద్దని సూచించారు. ఇప్పటికైనా మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య పై అసత్య ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, ఐఎన్టియుసి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సులానగర్ లో వడదెబ్బకు వ్యక్తి మృతి



**టేకులపల్లి, మే27, ప్రజాజ్యోతి:** వడదెబ్బ తగలడంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన టేకులపల్లి మండల పరిధి సులానగర్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం సులానగర్ గ్రామానికి చెందిన సూరేపల్లి జయరామయ్య(62) వడదెబ్బకు గురి కావడంతో మంగళవారం కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకొని మందులు తీసుకుని ఇంటికి వచ్చాడు. అదే రోజు సాయంత్రం వాంతులు, విరోచనాలు అధికంగా కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి మరల వెళ్లి చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మరణించినట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు.

## నాయీ బ్రాహ్మణులకు ఇందిరమ్మ ఇళ్లు, సంక్షేమ పథకాలలో ప్రాధాన్యత కల్పించాలి

- మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పరసా వెంకటేశ్వరావుకు నాయీ బ్రాహ్మణ సంఘం వినతిపత్రం



**అన్నపురెడ్డిపల్లి, మే 27, ప్రజాజ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలంలోని నాయీ బ్రాహ్మణులకు ఇందిరమ్మ ఇళ్లు, వివిధ సంక్షేమ పథకాలలో ప్రాధాన్యత కల్పించి సమాజంలో తగిన గుర్తింపు, ఆర్థిక భద్రత కల్పించాలని కోరుతూ మండల నాయీ బ్రాహ్మణ సంఘం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పరసా వెంకటేశ్వరావుకు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులు సమాజానికి తరతరాలుగా సేవలు అందిస్తూ జీవనం సాగిస్తున్నప్పటికీ ఆర్థికంగా, సామాజికంగా ఇంకా వెనుకబడిన పరిస్థితుల్లో ఉన్నారని పేర్కొన్నారు. జీవన ప్రమాణాలు మెరుగుపడటానికి ప్రభుత్వ మద్దతు ఎంతో అవసరమని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అన్నపురెడ్డిపల్లి మండలంలోని అర్హులైన పేద నాయీ బ్రాహ్మణ కుటుంబాలకు ప్రాధాన్యత ఇచ్చి ఇళ్లు మంజూరు చేయాలని వారు కోరారు. అలాగే ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలు, సబ్సిడీ రుణాలు, స్వయం ఉపాధి అవకాశాలు నేరుగా సంఘ సభ్యులకు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాయీ బ్రాహ్మణులకు సమాజంలో తగిన గుర్తింపు, గౌరవం దక్కేలా మరియు వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న వారికి ఆర్థిక భద్రత కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. తమ వెనుకబాటుతనాన్ని పరిశీలించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే విధంగా చూడాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పరసా వెంకటేశ్వరావును కోరారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పరసా వెంకటేశ్వరావు సానుకూలంగా స్పందిస్తూ నాయీ బ్రాహ్మణులకు అన్ని విధాలుగా సహకరిస్తామని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మండల నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పూదూరి నరహరి, పూదూరి శివ సాయి వినతిపత్రం అందజేశారు.

## ఇల్లందులో టీడీపీ వర్చువల్ మహానాడు

- స్త్రీలకు 33 శాతం సీట్లు, స్త్రీ శక్తి, స్త్రీ భద్రతపై ప్రత్యేక తీర్మానం



**ఇల్లందు, మే 27, ప్రజాజ్యోతి:** టిడిపి వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ హయం నుండి తెలుగుదేశం పార్టీ ప్రతి ఏటా నిర్వహించే మహానాడు ఈఏడాది వర్చువల్ గా నిర్వహించడం జరిగింది. ఇల్లందు పట్టణంలోని ఆధ్వర్యంలో ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్ లో బుధవారం జరిగిన వర్చువల్ మహానాడు కు సర్పంచులు, వార్డు మెంబర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై వీక్షించడం జరిగింది. జాతీయ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడి గా నియమితులైన నారా లోకేష్ ప్రత్యేక ఆకర్షణ నిలిచారు. తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ తో పాటు తెలంగాణ లో కూడా బలపరుస్తామని అందుకు తగ్గిన ప్రణాళికలతో ముందుకు వస్తామని కార్యకర్తలను నిరంతరం అందుబాటులో ఉంటానని నారా లోకేష్ స్పష్టం చేశారు. అదేవిదంగా స్త్రీలకు 33 శాతం సీట్ల రిజర్వేషన్, స్త్రీ శక్తి, స్త్రీ భద్రతపై ప్రత్యేక తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు, చాందావత్ రమేష్ బాబు, అజ్మీర బూలి, వార్డు సభ్యులు అఖిల్, నియోజకవర్గ నాయకులు పుచ్చకాయల సత్యనారాయణ, మనుబోతుల నర్సన్న, మైపా బాలరాజు, అజ్మీర హరి, దాసరి గోపాల్ కృష్ణ, కోమినేని సత్యనారాయణ, ములకలపల్లి నాగేశ్వరావు, శ్యామ్ తీవారి, దగుల లింగయ్య, చెలిమల బాబు, గోగేలా రాజేష్, ముక్కు శ్రీవెద్, శ్యామ్, పాల్గొన్నారు.

## వరదలకు ముందుగానే గోదావరి కరకట్టను మరమ్మతులు జరిపించండి



**భద్రాచలం టౌన్, మే 27, ప్రజాజ్యోతి** గోదావరి కరకట్ట పనులు యుద్ధ ప్రాతిపదిక చేపట్టి త్వరలో రానున్న వరదల నుంచి భద్రాచలం ప్రజలను రక్షించాలని సీపీఐఎంఎల్ మాస్ లైన్ పార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం సీపీఎంఎల్ ఆధ్వర్యంలో ఆంధ్రా-తెలంగాణ సరిహద్దుల్లో కరకట్ట గోడ కూలిపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు కెచ్చెల రంగారెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల్ని, ప్రభుత్వ అధికారులను, కరకట్ట పనులు వర్షాకాలం రాకముందే మరమ్మతులు చేయాలన్నారు. జూన్ నుంచి రాష్ట్రంలోనే వర్షాలు, వరదలు రానున్నాయని, ఆ పరిస్థితికి ముందే అవసరమైన నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టాలన్నారు. గత సంవత్సరం కాలం ముందు కరకట్ట పై ఉన్నటువంటి గోడ పడిపోయినప్పటికీ ఇప్పటివరకు మరమ్మతులు చేయకపోవడం నిర్మించకపోవడం దారుణమైన విషయమని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా వరదలు రాకముందే మరమ్మతులు చేపట్టాలని ఎంతో కాలం నుండి ప్రజల కోరుతున్న కరకట్ట లీకేజీలు, పగుళ్లు, స్లూయిజులు, ఇతర పనులని ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వం సకాలంలో చేయకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్న ప్రజల్ని కాపాడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్ లైన్ పార్టీ డివిజన్ నాయకులు దాసరి సాయి అన్న, మునిగేలా శివ ప్రశాంత్, బొర్రా శివగణేష్ పాల్గొన్నారు.

## రాష్ట్ర డీజీపీని కలిసిన బుడగం శ్రీనివాస్




**భద్రాచలం టౌన్, మే 27 ప్రజాజ్యోతి** రాష్ట్ర పెరిక కార్పోరేషన్ వైస్ చైర్మన్ బుడగం శ్రీనివాస్ బుధవారం హైదరాబాద్‌లో డీజీపీ సీవీ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్‌కు పుష్పగుచ్చం అందజేసారు. అలాగే బుడగం శ్రీనివాస్కు రాష్ట్ర పెరిక కార్పోరేషన్ వైస్ చైర్మన్‌గా నియమితులైనందుకు సీవీ ఆనంద్ అభినందనలు తెలిపారు.

## రేపు జిల్లాలో పర్యటించనున్న హౌజింగ్ కార్పోరేషన్ ఎండీ



**భద్రాచలం టౌన్ , మే 27 ప్రజాజ్యోతి** రాష్ట్రహౌసింగ్ కార్పోరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి. గౌతమ్ శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. తొలుత భద్రాచలంలోని సీతా రామచంద్రస్వామి వారిని దర్శించుకుంటారు. అనంతరం సారపాక, మణుగూరు, అశ్వాపురం, పాల్వంచ మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని పరిశీలించడంతో పాటు కలెక్టర్‌తో కలిసి జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై సమీక్షించనున్నారు.

## భద్రాద్రి రామయ్యకు అభిషేకం, నిత్యకల్యాణం



**భద్రాచలం టౌన్ , మే 27 , ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి బుధవారం సందర్భంగా ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

## ధ్వంసమైన జాతీయ రహదారిపై సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



**భద్రాచలం టౌన్, మే 27 ప్రజాజ్యోతి** భద్రాచలంలో బుధవారం పలు చోట్ల జాతీయ రహదారి ధ్వంసమై ఇబ్బందులకు గురవుతున్న చర్ల రోడ్డును తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి మాట్లాడుతూ చర్ల వెంకటాపురం మండలాల నుండి వచ్చే ఇసుక లారీలతో భద్రాచలం నుండి వెంకటాపురం వరకు జాతీయ రహదారి పూర్తిగా ధ్వంసం అయిపోతుందని అన్నారు. ప్రధానంగా భద్రాచలం పట్టణంలో అంబేద్కర్ సెంటర్ నుండి నన్నపనేని మోహన్ హైస్కూల్ వరకు తారుతో పోసిన జాతీయ రహదారి విధ్వంసం గా మారిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రామయ్య దర్శనానికి వచ్చే యాత్రికులు పర్ణశాలకు వెళ్లాలంటే చుక్కలు కనబడుతున్నాయని ఒక్కసారి ఈ రహదారిపై ప్ర యాణించిన యాత్రికులు మరో సారి భద్రాచలం పేరు ఎత్తితేనే భయపడిపోయే పరిస్థితులు వచ్చాయని అన్నారు. జాతీయ రహదారుల మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం భద్రాచలం పట్ టణ కార్యదర్శి గడ్డం స్వామి, పట్టణ కమిటీ సభ్యులు నకిరికంటి నాగరాజు పాల్గొన్నారు.

## పీసీసీ చీఫ్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



**చర్ల, మే 27: (ప్రజా జ్యోతి ):** భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఫారెస్ట్ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ పొదెం వీరయ్యతో కలిసి భద్రాచలం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ బోర పెద్దిరెడ్డి బుధవారం హైదరాబాద్ లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల బొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం భద్రాచలం నియోజకవర్గం లోని చర్ల మండలంలో నెలకొన్న పలు ప్రజా సమస్యలు, స్థానిక రాజకీయ పరిణామాలపై ఆయనతో చర్చించారు. మండల అభివృద్ధికి సంబంధించిన అంశాలను పీసీసీ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రవేట్ కంపెనీల కుట్రలను చేదిద్దాం

- రైతుకు అన్నం పెట్టే తెలంగాణ ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీలపై తప్పుడు ప్రచారాలా....?
- ఆంధ్రప్రదేశ్ లో ఆయిల్ ఫామ్ సాగు మనకంటే ఎక్కువ కానీ ఏపీ ఆయిల్ ఫెడ్ ను ప్రైవేట్ కంపెనీలు మింగేసాయి
- ప్రైవేట్ కంపెనీలకు కొందరు తొత్తులుగా మారి తెలంగాణ ఆయిల్ ఫేడ్ పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు.
- ప్రభుత్వం తరపున ఫ్యాక్టరీ నిర్మిస్తే సాగు పెరుగుతుందనే మంత్రి తుమ్మల ఆలోచన
- ఆయిల్ ఫామ్ రైతులు ఏ సహాయం అడిగినా చేయటానికి మంత్రి తుమ్మల సిద్ధంగా ఉన్నారు
- ప్రైవేట్ కంపెనీలకు తెలంగాణ ఆయిల్ ఫేడ్ ప్రధాన శత్రువు
- రైతులందరినీ ఏకం చేసి తెలంగాణ ఆయిల్ ఫేడ్ కు అండగా ఉంటాం....

మద్దినేని వెంకట్ ఆయిల్ ఫామ్ రైతు





**అశ్వారావుపేట, మే 27, ప్రజాజ్యోతి :** తెలంగాణలో ఆయిల్ ఫామ్ సాగు అభివృద్ధిని అడ్డుకునేందుకు కొన్ని ప్రైవేట్ కంపెనీలు కొందరు వ్యక్తులను అడ్డం పెట్టుకొని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని ఆయిల్ ఫామ్ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు అండగా నిలుస్తున్న తెలంగాణ ఆయిల్ ఫెడ్‌ను బలహీనపరచాలని కుట్రలు జరుగుతున్నాయని ఆయిల్ ఫామ్ రైతు మద్దినేని వెంకట్ అన్నారు. దమ్మపేట మండలంలోని అప్పారావుపేట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీలో విలేకరుల సమావేశంలో వెంకట్ మాట్లాడుతూ, ఆంధ్ర ప్రదేశ్‌లో ఆయిల్ ఫామ్ సాగు తెలంగాణ కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ అక్కడ ఆయిల్ ఫెడ్‌ను ప్రైవేట్ కంపెనీలు పూర్తిగా కబళించాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అలాంటి పరిస్థితి రాకుండా ప్రభుత్వం ఆయిల్ ఫామ్ రైతులకు అండగా నిలబడుతుందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ముందుచూపుతో అధిక రికవరీ వచ్చే ఆధునిక మిషనరీలను ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీలలో ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం తరపున కొత్త ఫ్యాక్టరీలు నిర్మిస్తే ఆ మండలంలో, జిల్లాలలో ఆయిల్ ఫామ్ సాగు మరింత విస్తరిస్తుందని మంత్రి భావిస్తున్నారని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తూ నిరంతరం అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ రైతులు ఆయిల్ ఫామ్ సాగును విస్తృతంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందికి పైగా ఆయిల్ ఫామ్ రైతులు ఉన్నారని, వారందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి, సాగులో మెలకువలతో పాటు సమస్యల పరిష్కారానికి శాస్త్రవేత్తలు, అధికారులతో సమన్వయం చేస్తూ ప్రతి విషయంలోనూ ఆయిల్ ఫామ్ రైతుకు అండగా నిలబడేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఆయిల్ ఫెడ్ బలంగా ఉన్నంతకాలం ప్రైవేట్ కంపెనీల ఆటలు సాగవని, అది తెలుసుకున్న ప్రైవేట్ కంపెనీలు కొంతమంది వ్యక్తులను పెంచి పోషిస్తూ తెలంగాణ ఆయిల్ ఫేడ్ పై తప్పుడు ప్రచారాలను చేయిస్తున్నారన్నారు. ఆయిల్ ఫామ్ సాగుతోనే రైతు ఆర్థికంగా బలపడగలడని రైతులు ఏ సహాయం అడిగినా చేయడానికి మంత్రి తుమ్మల సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తెలంగాణ ఆయిల్ ఫెడ్ ప్రైవేట్ కంపెనీలకు ప్రధాన అడ్డంకిగా మారిందని, ఆయిల్ ఫామ్ సాగుచేసే రైతులందరినీ ఏకం చేసి తెలంగాణ ఆయిల్ ఫెడ్‌కు అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ నిర్మల పుల్లారావు, మాజీ సొసైటీ చైర్మన్ మొగళ్లపు చెన్నకేశవరావు, కొయ్యల అచ్యుతరావు, సత్యనారాయణ పలు రైతుల పాల్గొన్నారు.

## ఆదివాసీ పోరుకేకకు సిద్ధంకండి

- తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు వాసం ముసలయ్య పిలుపు

**చర్ల, మే 27: (ప్రజా జ్యోతి):** జూన్ 3న పాకాల కొత్తగూడలో నిర్వహించనున్న “ఆదివాసీ చలో పోరుకేక” కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు వాసం ముసలయ్య ఆదివాసీ ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం చర్ల మండలంలోని సుబ్బంపేట గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు, రిజర్వేషన్ల పరిరక్షణ కోసం ఈ పోరుకేక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1976లో లంబాడాలను ఆదివాసీ జాబితాలో చేర్చడం వల్ల అసలైన గిరిజనులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఆదివాసీలకు లభించాల్సిన రిజర్వేషన్ అవకాశాలు ఇతరులు వినియోగించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 3న జరిగే ఆదివాసీ పోరుకేక భవిష్యత్ తరాల హక్కులను నిర్ణయించే కీలక కార్యక్రమమని అందువల్ల పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల హక్కులు కాలరాయబడుతున్నాయని విచ్చలవిడిగా అక్రమ వలసలు పెరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతాల పరిరక్షణ కోసం పార్టీలకు అతీతంగా అందరూ ఒక్కటై ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అక్రమ వలసలను అరికట్టాలంటే ఆదివాసీ పోరాటాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కారం నాగేశ్వరావు, సత్యవతి, కాక రమణ, కాక పావని, వసంత కుమారి, సుశీల, చిన్నక్క, ముసలమ్మ, యాలం సరోజన తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి కార్మికులను రెండుసార్లు ఫోటోలు తీసే పద్ధతిని రద్దు చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం స్వామి



**భద్రాచలం టౌన్, మే 27, ప్రజాజ్యోతి** ఉపాధి హామీ కార్మికులను రెండుసార్లు ఫోటోలు తీసే పద్ధతిని రద్దు చేయాలని, పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం స్వామి డిమాండ్ చేశారు. భద్రాచలం పంచాయతీ పరిధిలో మనుబోతుల చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ ఉపాధి పని చేసే కూలీలను పని ప్రారంభానికి ముందు ఒకసారి పని పూర్తయ్యాక మరోసారి ఫోటోలు తీస్తూ సమయం అంతా వృధా చేయటం జరుగుతుందని దీనివల్ల పని సరిగా చేయలేకపోతున్నామని కూలీలు సంఘం నాయకులకు తెలిపారు. ఫోటోలు పని ప్రదేశంలో కాక ఐటిడిఏ లోని ఉపాధి కార్యాలయం నందు తీయడం వల్ల పని ప్రదేశం నుండి రెండుసార్లు ఉపాధి కార్యాలయం వరకు వెళ్ళవలసి వస్తుందని చాలా ఇబ్బంది పడుతున్నామని కూలీలు సంఘం నాయకుల వద్ద వాపోయారు. ఉపాధి పని ప్రదేశంలోనే ఫోటోలు తీయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రవీందర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సౌభాగ్యం, సక్కుబాయి పాల్గొన్నారు.



- అసలు వ్యాపారమే చేయని వారికి షాపులా!
- ఏళ్ల తరబడి షాపులు నడుపుకునే వారికి మొండి చేయి!
- ఇదెక్కడి తీరంటూ ప్రశ్నలు
- 51వ నెంబర్ షాపు కేటాయింపుపై పలు అనుమానాలు!
- అధికారులకు తెలిసి జరిగిందా.. తెలియదా
- మరోమారు పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలంటున్న అర్హులు
- పాత మార్కెట్ లో వ్యాపారాలు చేసే వారికి న్యాయం చేయరూ
- అధికారులు జర దృష్టి సారించరూ!

# ఇష్టానుసారంగా... షాపులను కేటాయించారా?

**ఇల్లందు మున్సిపల్ పరిధిలో కొన్ని ఏళ్ల నుంచి పాత కూరగాయల మార్కెట్ లో వ్యాపారం చేసుకుంటున్న వారికి అన్యాయం జరిగిందని పలువురు పేర్కొంటున్నారు. పాత మార్కెట్ లో వ్యాపారం చేసే వారికే మొదటి ప్రాధాన్యత ఇస్తామని అధికారులు చెప్పిన కానీ అది పూర్తి స్థాయిలో ఆచరణకు సాధ్యమవ్వలేదనే ఆరోపణలు లేకపోలేదు. రూ. కోట్లతో నూతనంగా మోడల్ మార్కెట్ ను నిర్మించి ఏళ్ల గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క షాపు కేటాయించలేదు. పలు దఫాలుగా వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసిన కానీ షాపుల కేటాయింపు ఓ కొలిక్కి రాలేదు.**

● ఇల్లందు, ప్రజాజ్యోతి

గతంలో పాత మార్కెట్ లో వ్యాపారాలు చేసే వారికి మాత్రమే మోడల్ మార్కెట్ లో షాపులను కేటాయిస్తామని అధికారులు సూచించగా, కొందరికి మూడు నుంచి నాలుగు షాపులు కావాలని అడగడంతో ఇంత కాలం జాప్యం జరిగిందని కొందరు వ్యాపారులు గుసగుసలాడుకుంటున్నారు. మరి ముఖ్యంగా గత కొన్ని రోజుల క్రితం మోడల్ మార్కెట్ లో కేటాయించిన షాపులలో అసలు ఎలాంటి వ్యాపారం చేయని వారికి షావును కేటాయించాలని, ఇదెక్కడి న్యాయం అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రదానంగా మోడల్ మార్కెట్ లో 51వ నెంబర్ షాపు కేటాయించిన వ్యక్తి అసలు ఎలాంటి వ్యాపారం చేయరని, కొందరు చక్రం తిప్పి ప్రోత్బలం వల్లనే ఆ 51వ నెంబర్ షాపు కేటాయించినట్లు విమర్శలు ఉన్నాయి. అసలు ఎలాంటి వ్యాపారం చేయని వారికి ఎలా షాపును కేటాయించార ని, ఇదెక్కడి తీరని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నారు. అసలు 51వ నెంబర్ షాపు కేటాయించిన వ్యక్తి అసలు వ్యాపారి కాదని అధికారులకు తెలుసా.. లేక తెలియకుండా జరిగిందా అనేది స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చొరవ చూపి పూర్తి స్థాయిలో పరిశీలన చేసి ఎలాంటి వ్యాపారం చేయకున్న 51వ షాపు కేటాయించిన దానిని రద్దు చేసి పాత మార్కెట్ లో వ్యాపారం చేసే వారికి న్యాయం చేయాలని పలువురు వ్యాపారులు కోరుతున్నారు.



- **పారదర్శకంగానే షాపులను కేటాయించాం: చింత శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్, ఇల్లందు**

ఇల్లందు నూతన మోడల్ మార్కెట్ లో షాపులను పారదర్శకంగానే కేటాయించాం. మార్కెట్ వద్ద కొన్ని షెడ్ల నిర్మాణం పూర్తి కాలేదు. అవి పూర్తి అయ్యాక కొత్తిమీర, నిమ్మకాయలు విక్రయించే వారికి కేటాయించడం జరుగుతుంది. షాపులు కావాల్సిన వారు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలి. మోడల్ మార్కెట్ లో అనర్హులకు షాపు కేటాయించినట్లు జరిగితే విచారణ నిర్వహించి, ఆ షాపును రద్దు చేస్తాం.

# వేసవి ఆరోగ్య పానీయాలు

వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి, శరీరాన్ని హైడ్రేట్‌గా మరియు ఆరోగ్యంగా ఉంచడానికి సహజ పానీయాలు ఎంతో మేలు చేస్తాయి. ఇవి శరీరానికి అవసరమైన ఖనిజాలు, విటమిన్లు అందించి అలసటను తగ్గిస్తాయి.





**వేసవిలో తీసుకోవాల్సిన ముఖ్యమైన ఆరోగ్య పానీయాలు:**

**కొబ్బరి నీరు:** శరీరానికి తక్షణ శక్తిని ఇవ్వడంతో పాటు, రోజంతా హైడ్రేట్‌గా ఉంచుతుంది. ఇది ఎలక్ట్రోలైట్స్ మరియు పొటాషియంకు అద్భుతమైన మూలం.

**మజ్జిగ:** వేసవిలో జీర్ణక్రియను మెరుగుపరచడంలో మరియు శరీర ఉష్ణోగ్రతను తగ్గించడంలో మజ్జిగ, లస్సీ చాలా సహాయపడతాయి.



**నిమ్మరసం:** విటమిన్ సి అధికంగా ఉండే నిమ్మరసం, నీటిలో చిటికెడు ఉప్పు మరియు తేనె కలుపుకుని తాగితే డీహైడ్రేషన్‌ను నివారించవచ్చు.

**పుచ్చకాయ రసం:** ఇందులో నీటి శాతం (90% కంటే ఎక్కువ), యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని చల్లబరుస్తాయి.

**పుదీనా నీరు:** జీర్ణక్రియకు మంచిది. ఒక లీటర్ నీటిలో కొన్ని పుదీనా ఆకులు, నిమ్మరసం పిండుకుని రోజంతా తాగడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

**సబ్జా గింజల పానీయం:** నానబెట్టిన సబ్జా గింజలను మంచినీటిలో గానీ, నిమ్మరసంలో గానీ కలుపుకుని తాగితే శరీరానికి తక్షణమే చలువ చేస్తుంది.

**చెరుకు రసం:** వేసవిలో చెమట ద్వారా కోల్పోయిన శక్తిని, గ్లూకోజ్‌ను త్వరగా అందిస్తుంది.



# కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- **డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు**



**పాల్వంచ, మే 27, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు సమగ్ర అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డిసిఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొత్తగూడెం కార్పొరేషన్ పాల్వంచ పరిధిలోని పలు డివిజన్లలో డివిజన్ స్థాయి సమావేశాలు నిర్వహించారు. పట్టణ పరిధిలోని నెహ్రూనగర్, 47వ డివిజన్, రామానందతీర్థ కాలనీలలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో కొత్వాల శ్రీనివాసరావుతో పాటు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ కమిటీల ఏర్పాటు ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేస్తామని కొత్వాల తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు చీకటి కార్తీక్, కార్పొరేటర్లు కాల్వ భాస్కరరావు, సీరపు సుగుణ, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శులు నూకల రంగారావు, పి. నరహరి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న గౌడ్, కాంగ్రెస్ నాయకులు వాసుమల్ల సుందర్ రావు, వై. వెంకటేశ్వర్లు, పెంకె శ్రీను, ఎస్కే చాంద్ పాషా, తురకా లక్ష్మయ్య, వాసుమల్ల సోమయ్య, వల్లమల్ల వెంకటరత్నం, మిరియాల రవి, శశి, జోషి, గడదేసి ప్రభాకర్, పల్లపోతుల ఉదయశ్రీ, ఘనీని, నజీర్ అహ్మద్, సంకటి శ్రీను, సంకటి వెంకన్న, ఎస్కే జాకిర్, బండి శ్రీను, బండి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# తోగ్గూడెంలో తీరిన తాగునీటి కష్టాలు

- **ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చొరవతో విద్యుత్ బోరు ఏర్పాటు**
- **గ్రామస్తులు హర్షాతిరేకాలు**



**పినపాక, మే 27(ప్రజాజ్యోతి):** తోగూడెం గ్రామపంచాయతీలోని ఎస్ టీ కాలనీ కింది గుంపు గ్రామస్తుల 20 ఏళ్ల తాగునీటి కల బుధవారం సాకారమైంది. తాగునీటి సౌకర్యం లేక పడుతున్న ఇబ్బందులను తోగ్గూడెం గ్రామస్తులు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్తుల సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి తక్షణమే విద్యుత్ బోరు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం బుధవారం సంబంధిత శాఖ అధికారులు విద్యుత్ బోరును ఏర్పాటు చేసేందుకు రిగ్ సాయం తో పనులు ప్రారంభించారు. ఏళ్ల తరబడి తాగునీటికి పడుతున్న కష్టాలు తీరిపోతుండడంతో గ్రామస్తులు హర్షతిరేకాలు వ్యక్తం చేస్తూ, తమ సమస్యల పట్ల అడిగిందే తడవుగా స్పందించి బోరు ఏర్పాటు చేయించిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు , సర్పంచ్, గ్రామస్తులు ప్రత్యేక అభినందనలు తెలియచేస్తున్నారు, ఈ కార్యక్రమం లో సర్పంచ్ పూనెం వెంకటేశ్వర్లు , ఉప సర్పంచ్ అచ్చ నవీన్, వార్డు సభ్యులు చిర్ర ఉప్పలయ్య, పాయం సునీత, స్థానిక కాంగ్రెస్ నాయకులు చిట్టిమల్ల సతీష్ చారి, పాయం వెంకటేశ్వర్లు, చీమల నవీన్, చీమల పాపయ్య, సల్లూరి లక్ష్మయ్య పాయం లింగయ్య, పడిగా కామరాజు, కోరం సమ్మయ్య, పూనెం పార్వతమ్మ తదితరులు గ్రామస్తులు, కార్యకర్తలు, పాల్గొన్నారు